
# సాక్షి ఒడిశా

శుక్రవారం । 29 । డిసెంబర్ । 2023



**శ్రీమందిరం ఆదాయం లెక్కింపు**

భువనేశ్వర్‌: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,10,594లు, బంగారం 8గ్రాము 540 మిల్లీగ్రాములు, వెండి 24 గ్రాములు 950 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



**రిజర్వాయర్‌లో పడవ బోల్తా**

కొరాపుట్‌ జిల్లాలోని జోలాపుట్‌ రిజర్వాయర్‌లో పడవ బోల్తాపడడంతో ఒక వ్యక్తి మృతి చెందడంతో పాటు నలుగురు గల్లంతైన ఘటన గురువారం చోటుచేసుకుంది.

- 8లో



**సందడే.. సందడి**

రాయగడ గోవింద చంద్రదేవ్‌ ఉన్నత పాఠశాల మైదానంలో చొయితి ఉత్సవాలు సందడిగా కొనసాగుతున్నాయి.

- 8లో

# బాహుదా తీరం.. పక్షుల సోయగం..!






బరంపురం అటవీ డివిజన్‌ పరిధి బాహుదా నదీతీరంలో తొలిసారిగా విదేశీ పక్షులు సందడి చేస్తున్నాయి. ఈ ఏడాది ఆసియాలో అతి పెద్దదైన చిలికా సరస్సులోని 24 దీవుల్లో రికార్డు స్థాయిలో సుమారు 185 జాతులకి చెందిన 10 లక్షలకు పైగా పక్షులు విడిది ఏర్పరుచుకున్నాయి. దీంతో అక్కడ విడిది స్థలం లేకపోవడంతో తొలిసారిగా బాహుదా తీరంలో తమజాతి పక్షులతో జత కడుతూ విదేశీ పక్షులు కనువిందు చేస్తున్నాయి. ఇటీవల నదీతీరంలో సంచరిస్తున్న ఏనుగులను అడవిలోకి తరలించేందుకు బరంపురం అటవీ శాఖ అధికారులు అటువైపు వెళ్లడంతో విదేశీ పక్షుల సందడి వెలుగులోకి వచ్చింది. దీంతో వీటికి రక్షణ కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు డీఎఫ్‌వో అముల్యా కుమార్‌ ప్రధాన్‌ తెలియజేశారు.

– బరంపురం









## న్యూస్‌రీల్‌

### ఓజేఎస్‌ పరీక్ష ఫలితాలు విడుదల

● టాపర్‌గా సుశ్రిత మిశ్రా

భువనేశ్వర్‌: ఒడిశా పబ్లిక్‌ సర్వీస్‌ కమిషన్‌ (ఓపీఎస్‌సీ) నిర్వహించిన ఒడిశా జ్యుడీషియల్‌ సర్వీస్‌ పరీక్ష ఫలితాలు ప్రకటించింది. ఈ ఫలితాల్లో 55 మంది అభ్యర్థులు ఉత్తీర్ణత సాధించారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణులకు రాష్ట్రంలో సివిల్‌ జడ్జీల నియామకానికి ఓపీఎస్‌సీ సిఫార్సు చేసింది. ఓజేఎస్‌ పరీక్ష ఫలితాల్లో యువతులు ఉన్నత ఫలితాలతో ముందంజలో నిలిచారు. టాప్‌ 10 ర్యాంక్‌ హోల్డర్లలో ఎనిమిది మంది యువతులు ఉండడం విశేషం. సుశ్రిత మిశ్రా అగ్రస్థానంలో నిలవగా, నిలిసా పట్నాయక్‌ రెండో స్థానంలో నిలిచింది. అదేవిధంగా అనన్య మిశ్రా తృతీయ స్థానంలో నిలిచింది. రాణి రంజిత, లోపముద్ర ఆచార్య, హర్షిత మిశ్రా వరుసగా నాలుగు, ఐదు, ఆరో స్థానాలతో ఉత్తీర్ణత సాధించారు. ప్రజ్ఞా సుమన్‌ మహాపాత్ర ఏడో ర్యాంక్‌, ఎస్‌.ఆర్‌.తాషాలి ఎనిమిదో ర్యాంక్‌ ఉత్తీర్ణులుగా నిలిచారు. యువకుల్లో తొమ్మిదో ర్యాంక్‌తో సత్యజిత్‌ పాణి ముందంజలో నిలవగా, లలితేందు దేబొత 10వ ర్యాంక్‌తో ఉత్తీర్ణత సాధించాడు. 7వ ర్యాంక్‌తో ఉత్తీర్ణత సాధించిన ప్రజ్ఞా సుమన్‌ స్థానిక ఉత్కళ విశ్వవిద్యాలయంలో ఎల్‌ఎల్‌ఎం పరీక్ష – 2022లో అత్యధిక మార్కులు సాధించినందుకు జస్టిస్‌ గతి కృష్ణ మిశ్రా బంగారు పతకాన్ని అందుకుంది. ఉత్తీర్ణులైన అభ్యర్థుల వివరాల కోసం www.opsc.gov.in వెబ్‌సైట్‌ సందర్శించాలని కమిషన్‌ సూచించింది.

### ఎంపీ రమేష్‌ మజ్జికి అస్వస్థత



కొరాపుట్‌: నబరంగ్‌పూర్‌ లోక్‌సభ సభ్యుడు రమేష్‌ చంద్ర మజ్జి తీవ్ర అస్వస్థతకు లోనయ్యారు. గురువారం షుగర్‌ లెవల్స్‌ 550 చేరడంతో తీవ్ర ఇబ్బందికి గురయ్యారు. వెంటనే స్థానిక వైద్యుల సూచన మేరకు భువనేశ్వర్‌లోని ఒక ప్రైవేట్‌ ఆస్పత్రిలో చేరారు. వైద్యులు వైద్యం ప్రారంభించడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. ప్రస్తుతం రమేష్‌ ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు అతని తమ్ముడు జొరిగాం ఎమ్మెల్యే ప్రకాష్‌ చంద్ర మజ్జి ప్రకటించారు.

### చెలరేగిన మంటలు



దట్టంగా కమ్ముకున్న పొగలు

భువనేశ్వర్‌: ఖుర్దా జిల్లా బఘిమారి ప్రాంతంలోని వంట నూనె కార్మాగారంలో గురువారం అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో పరికరాలు, ఇతర పదార్థాలు దగ్ధమయ్యాయి. ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. కార్మికులంతా క్షేమంగా ఉన్నారని తెలిపారు. ప్రాథమిక సమాచారం మేరకు బఘిమారి ఠాణా పరిధి సరువా పారిశ్రామికవాడలో ఉన్న యూనివర్సల్‌ ఇన్‌ఫ్రా అండ్‌ అగ్రి ఆయిల్‌ ప్రైవేట్‌ లిమిటెడ్‌ కార్ఖానాలో గురువారం మధ్యాహ్నం మంటలు చెలరేగాయి. ఫ్యాక్టరీ గోడౌన్‌, కార్యాలయంలో దట్టమైన పొగలు కమ్ముకోవడంతో సమయస్ఫూర్తితో కార్మికులు, ఉద్యోగులు అందరూ కాంప్లెక్స్‌ నుంచి బయటకు తరలివచ్చారు. దీంతో పెను ముప్పు తప్పింది. సమాచారం అందడంతో అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ చర్యల్లో మూడు యూనిట్ల అగ్నిమాపక యంత్రాలను రంగంలోకి దింపారు. అగ్ని ప్రమాదానికి ఖచ్చితమైన కారణం ఇంకా తెలియాల్సి ఉంది. విద్యుత్‌ షార్ట్‌ సర్క్యూట్‌ కారణంగానే ఈ ఘటన జరిగినట్లు అనుమానిస్తున్నారు.

### రాష్ట్రంలో మరో 3 కరోనా కేసులు

● 8కి చేరిన బాధితుల సంఖ్య

భువనేశ్వర్‌: రాష్ట్రంలో గత 24 గంటల్లో మరో మూడు క్రియాశీలక కోవిడ్‌ కేసులను గుర్తించారు. దీంతో పీడితుల సంఖ్య 8కి పెరిగింది. పీడితుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది. బుధవారం 690 మందిని పరీక్షించారు. వారిలో ముగ్గురిలో ఒమిక్రాన్‌ కొత్త సబ్‌ వేరియంట్‌ జేఎన్‌–1 ద్వారా ప్రభావితమైనట్లు కనుగొనబడిందని రాష్ట్ర ప్రజారోగ్య శాఖ డైరెక్టర్‌ డాక్టర్‌ నిరంజన్‌ మిశ్రా తెలిపారు. రోగులందరూ గృహ నిర్బంధంలో ఉన్నారు. వీరందరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా కొనసాగుతుందని ఆయన వివరించారు. కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ జారీ చేసిన గణాంకాల ప్రకారం 92 శాతం మంది రోగులు గృహ నిర్బంధంలో జాగ్రత్తలు పాటిస్తున్నారు. దీర్ఘకాలిక రోగ పీడితులు ఆస్పత్రుల్లో చేరి చికిత్స పొందుతున్నారు. జేఎన్‌–1 లక్షణాలు కాలానుగుణ ఫ్లూ మాదిరిగానే ఉంటాయి. ఎవరైనా ఫ్లూ లాంటి లక్షణాలను కలిగి ఉంటే ఆలస్యం చేయకుండా వారు పరీక్షలు చేయించుకోవాలని డాక్టర్‌ నిరంజన మిశ్రా అభ్యర్థించారు.

# సమరోత్సాహంతో బీజేపీ

● సార్వత్రిక ఎన్నికలకు సన్నద్ధం
● ఇటీవల ప్రధాని నరేంద్రమోదీతో రాష్ట్ర బీజేపీ ఎమ్మెల్యేల సమావేశం
● త్వరలో రాష్ట్రంలో పీఎం పర్యటన



పీఎం మోదీతో బీజేపీ ఎమ్మెల్యేలు, నాయకులు

భువనేశ్వర్‌: రాష్ట్రంలో త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ ఘన విజయం సాధించేందుకు లక్ష్యాలు రూపొందించుకుంటోంది. ఆంగ్ల సంవత్సరాది పురస్కరించుకుని వ్యూహాత్మక కార్యాచరణకు శ్రీకారం చుట్టనుంది. రాష్ట్రంలో సుదీర్ఘంగా పాలనపగ్గాలతో కొనసాగుతున్న బిజూ జనతాదళ్‌ (బీజేడీ)ని గద్దె దించడమే ధ్యేయంగా కృషి చేస్తున్నట్లు భారతీయ జనతా పార్టీ శాసనసభ నాయకుడు జయ నారాయణ మిశ్రా తెలిపారు. పార్లమెంట్‌ ఎన్నికల్లో రాష్ట్రంలోని 21 లోక్‌సభ స్థానాలను కైవసం చేసుకోవడమే తమ లక్ష్యమని ఆయన ఉద్ఘాటించడం విశేషం. ఈ నేపథ్యంలో ఇటీవల న్యూఢిల్లీలో పార్టీ శాసన సభ్యులు ప్రధాని నరేంద్ర మోదీతో ప్రత్యక్షంగా భేటీ అయ్యారు. సార్వత్రిక ఎన్నికల్లో సిటింగ్‌ ఎమ్మెల్యేల పాత్రని వివరించినట్లు సమాచారం.

**న్యూ ఇయర్‌ నుంచి పోరు షురూ**

కొత్త సంవత్సరం జనవరి నుంచి బీజేపీ పోరాటం ఉధృతం చేసేందుకు సిద్ధమవుతోంది. భారత ప్రధాని సందేశం మార్గదర్శకంగా ఈ పోరు కొనసాగించేందుకు బీజేపీ రాష్ట్ర వర్గం ఉరకలేస్తుంది. రాష్ట్రంలో పలు సంచలనాత్మక వైఫల్యాల్ని సాధారణ ప్రజానీకం దృష్టికి తీసుకెళ్లి బీజేడీ పాలన వైఫల్యాలను ఎండగట్టేందుకు రంకెలు వేస్తోంది. పూరీ జగన్నాథ ఆలయంలోని రత్న భాండాగారం తెరవడం, యూట్యూబర్‌ కమియా జానీ శ్రీమందిర్‌లోకి ప్రవేశించడం, మద్యం వ్యాపారి స్థావరాల్లో భారీ నగదు స్వాధీనం, ఒడిశా వెనుకబాటుతనం, మహిళలపై అకృత్యాలు, గనుల కుంభకోణం వంటి అంశాలపై బీజేపీ బీజేడీ ప్రభుత్వాన్ని టార్గెట్‌ చేయాలని సంకల్పించింది.

**ప్రధానమంత్రి పర్యటన**

సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా పార్టీ కార్యకర్తలను ఉత్సాహపరిచేందుకు భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీని రాష్ట్రానికి ఆహ్వానించారు. ఆయన రాక పార్టీని రాష్ట్రంలో మరింత బలోపేతం చేస్తుందని బీజేపీ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి. జనవరిలో రాష్ట్ర పర్యటనకు ప్రధాని అంగీకరించినట్లు పార్టీ శ్రేణుల సమాచారం.

**గెలుపు గుర్రాలకే అవకాశం**

త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో స్పష్టమైన ఆధిక్యత ఆశిస్తున్న బీజేపీ బరిలోకి దింపే అభ్యర్థుల ఎంపికపై ఇప్పటినుంచే దృష్టి సారించింది. ప్రత్యేక ప్రామాణికాలు ఖరారు చేసుకుని అభ్యర్థులకు టికెట్లు కేటాయించనుంది. బలమైన ప్రజా సంబంధాలు, పార్టీపరంగా విధేయత, సామాజిక దృక్పథం, ప్రజా ప్రాతినిధ్యంలో అంకితభావం వంటి ప్రాథమిక అంశాలు పరిగణనలో ఉన్నట్లు సమాచారం.

**ప్రభుత్వ ఏర్పాటే లక్ష్యం**

ఈసారి భారతీయ జనతా పార్టీ రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని రాష్ట్ర శాసన సభ విపక్ష నేత జయ నారాయణ మిశ్రా గట్టి ధీమా వ్యక్తం చేశారు. మొత్తం 21 లోక్‌సభ స్థానాల్లో విజయం సాధిస్తుందన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో పొత్తుకు అవకాశం లేదని బీజేపీ సీనియర్‌ నేత కనకవర్ధన్‌ సింగ్‌ దేవ్‌ తెలిపారు. రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని వెల్లడించారు.

# రాయగడ బంద్‌ ప్రశాంతం



కపిలాస్‌ కూడలి వద్ద బైఠాయించిన మహిళలు

హత్యకు గురైన లక్ష్మీ మాఝి (ఫైల్‌)

● మహిళ హత్యకు నిరసనగా బీజేపీ బంద్‌

రాయగడ: ఆదివాసీ మహిళ హత్యపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ జిల్లా బీజేపీ మహిళా మోర్చా గురువారం రాయగడలో ఆరు గంటల బంద్‌ నిర్వహించింది. స్థానిక కపిలాస్‌ కూడలిలో ఆ పార్టీ రాష్ట్ర శాఖ మహిళా మోర్చా సాధారణ కార్యదర్శి బబిలత పాత్రో నేతృత్వంలో కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని రోడ్డుపై బైఠాయించారు. ఉదయం 7 గంటల నుంచి వారంతా ఆందోళన చేపట్టడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. అదేవిధంగా కొన్ని ప్రైవేట్‌ విద్యాసంస్థలు రవాణా సౌకర్యం లేకపోవడంతో ఆయా పాఠశాలలను మూసివేశారు. బీజేపీ బంద్‌ మధ్యాహ్నం ఒంటి గంట వరకు కొనసాగింది.

**ఇదీ విషయం**

చంద్రపూర్‌లో ఈనెల 21వ తేదీన జిల్లాలోని కాసీపూర్‌ సమితి నకిటిగుడ గ్రామానికి చెందిన లక్ష్మీ మాఝి అనే ఆదివాసీ మహిళ హత్యకు గురయ్యింది. ఈ నేపథ్యంలో పోలీసులు నిందితులను ఇంతవరకు అరెస్టు చేయకపోవడాన్ని నిరసిస్తూ ఈ బంద్‌కు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బబిలత పాత్రో మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువయ్యిందని ఆరోపించారు. అమాయక ఒక ఆదివాసీ మహిళ హత్యకు గురయ్యి, వారం రోజులు గడుస్తున్నా ఇంతవరకు నిందితులను అరెస్టు చేయకపోవడం పోలీసులు నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. ఇటువంటి తరహా ఉదంతాలు రాష్ట్రంలో తరచూ చోటుచేసుకుంటున్నప్పటికీ ప్రభుత్వం నిమ్మకునీరెత్తనట్లుగా వ్యవహరిస్తుండడం విచారకరమన్నారు. హత్యకు గురైన మహిళా కుటుంబానికి తగిన న్యాయం చేకూరేంతవరకు ఇటువంటి తరహా ఆందోళనలు కొనసాగుతాయని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మహిళల రక్షణ కోసం చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. ఆందోళనలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శివకుమార్‌ పట్నాయక్‌, పట్టణ శాఖ అధ్యక్షురాలు మంజుల మినియాక, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బసంతకుమార్‌ ఉలక, శివశంకర్‌ ఉలక, ఎస్సీ, ఎస్టీ సెల్‌ రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షుడు కాశీరాం మాఝి తదితరులు పాల్గొన్నారు. ఈ బంద్‌ కారణంగా ప్రజలు కొంత వరకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

# నందనకానన్‌కు కొత్త జంతువులు



చిరుత పులి



తెల్ల సింహం

భువనేశ్వర్‌: డిసెంబర్‌ 29న స్థాపన దినోత్సవం సందర్భంగా సందర్శకుల కోసం నందనకానన్‌ జంతు ప్రదర్శనశాల అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. సందర్శకులు మరియు జంతు ప్రేమికులు కొత్త సంవత్సరం నుంచి కొత్త జంతువులను చూసే అవకాశం ఉంటుంది. న్యూ ఇయర్‌లో నందన్‌కానన్‌ జూలాజికల్‌ పార్కుకు కొత్త అతిథి జంతువులు రానున్నట్లు ప్రిన్సిపల్‌ చీఫ్‌ కన్జర్వేటర్‌ ఆఫ్‌ ఫారెస్ట్‌ (వన్యప్రాణి) సుశాంత్‌ నందా మీడియాకు గురువారం తెలిపారు. చిరుతలు, తెల్ల సింహం పిల్లలు, కొత్త పక్షులు నగర జంతు ప్రదర్శనశాల అందాన్ని మరింత పెంచుతాయి. జంతు మార్పిడి కార్యక్రమం కింద జనవరిలో వివిధ ప్రాంతాల నుంచి వీటిని తీసుకుని వస్తున్నట్లు వివరించారు. చిరుత పులులు, తెల్ల సింహం పిల్లలు దుబాయ్‌ నుంచి వస్తాయి. జిరాఫీ పశ్చిమ బెంగాల్‌లోని అలీపూర్‌లోని సెంట్రల్‌ జూ నుంచి వస్తుందన్నారు. 5 మణిపూర్‌ జింకలకు బదులుగా ఒక మగ, ఒక ఆడ చిరుతను తీసుకువస్తుంది. అదేవిధంగా యూఏఈ దుబాయ్‌ సఫారీ పార్క్‌తో ఐదు బ్లాక్‌బక్స్‌లకు బదులుగా కొన్ని ఆఫ్రికన్‌ తెల్ల సింహాలను పొందుతుంది. రాష్ట్ర జంతు ప్రదర్శనశాలలో 4,000 కంటే ఎక్కువ జంతువులు, పక్షులు, సరీసృపాలు ఉన్నాయి. వాటిని 212 ఎన్‌క్లోజర్లలో ఉంచారు. జూలో మొత్తం 156 రకాల జంతువులు ఉన్నాయి.

# భారీ మావో డంప్‌లు స్వాధీనం




మల్కన్‌గిరి: డంప్‌లోని సామగ్రితో జవాన్లు

జయపురం/కొరాపుట్‌: కొరాపుట్‌ జిల్లా పోలీసులు ఆంధ్ర–ఒడిశా సరిహద్దు ప్రాంతంలో భారీ డంప్‌ స్వాధీనం చేసుకున్నారు. జయపురం సదర్‌ పోలీసు అధికారి ఈశ్వర తండి తెలిపిన వివరాల మేరకు.. మావోయిస్టుల డంప్‌పై ఈనెల 26వ తేదీన పోలీసులకు సమాచారం వచ్చిందన్నారు. ఈ మేరకు ఎస్‌వోజీ బృందం కొరాపుట్‌ జిల్లా మాచ్‌ఖండ్‌ పోలీసు ప్రాంతం కొరాపుట్‌– మల్కన్‌గిరి– ఆంధ్రప్రదేశ్‌ సరిహద్దు ప్రాంతాల్లో గాలింపు చేపట్టారన్నారు. కాగా ఎట్టకేలకు మాచ్‌ఖండ్‌ పోలీసుస్టేషన్‌ పరిధి కొడాపుట్‌, గుముడపుట్‌ గ్రామాల అటవీ ప్రాంతంలో 27వ తేదీ మధ్యాహ్నం డంప్‌ కనుగొన్నట్లు వెల్లడించారు. డంప్‌లో ఒక పిస్టల్‌, 14 అమ్యునిటేషన్‌ పిస్టల్స్‌, 7 కేజీల బరువుతో ఉండే 8 టిఫిన్‌ బాంబులు, 3 కేజీల బరువుతో ఉండే 9 టిఫిన్‌ బాంబులు, 2 డిటోనేటర్లు, 50 మీటర్ల వైర్లు లభించాయి. భద్రతా దళాలను టార్గెట్‌ చేసేందుకు సామగ్రి ఉంచారని అనుమానిస్తున్నారు. దీంతో ఈ ప్రాంతంలో కూంబింగ్‌ ముమ్మరం చేశామని వెల్లడించారు.



స్వాధీనం చేసుకున్న సామగ్రితో జవాన్లు

మల్కన్‌గిరి: జిల్లాలోని కలిమెల సమితి బెజంగవాడ గ్రామ సమీపంలోని అడవిలో మావోయిస్టులు అమర్చిన భారీ డంప్‌ను 142 బెటాలియన్‌ బీఎస్‌ఎఫ్‌ జవాన్లు గురువారం స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. కూర్మానూర్‌ పంచాయతీ పరిధి బెజంగ్‌వాడ రిజర్వ్‌ ఫారెస్ట్‌లో డంప్‌ ఉన్నట్లు జవాన్లకు ముందస్తు సమాచారం వచ్చింది. దీంతో బుధవారం రాత్రి నుంచి కూంబింగ్‌ నిర్వహించారు. అనంతరం గురువారం సాయంత్రం డంప్‌ గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అందులో 22 నాటు తుపాకీలు, 9 ఎంఎం బాల్‌ ఏఎంఎన్‌, జిలిటెన్‌ స్టిక్స్‌, 36 హ్యాండ్‌ గ్రెనేడ్స్‌, ఎలక్ట్రిక్‌ డిటోనేటర్‌, గోటాప్‌ బ్యాటరీ ఐరాన్‌ పేట్లు, మావో సాహిత్యాలు, ఐడీ కార్డులు ఉన్నాయి. దీంతో ఈ ప్రాంతంలో భద్రత దళాలను అప్రమత్తం చేశారు.

## క్లుప్తంగా

### శక్తి పీఠాన్ని సందర్శించిన హైకోర్టు జడ్జి



మందిరం వద్ద న్యాయవాది మురారి రమణ్ కుటుంబ సభ్యులు

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లాలో ఏకైక శక్తి పీఠం మా బండారు ఘరణి శక్తి పీఠాన్ని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మురారి రమణ్ సందర్శించారు. గురువారం ఉదయం కుటుంబ సమేతంగా తరలివచ్చారు. స్థానిక సీనియర్ న్యాయవాది ఉమా త్రిపాఠి నేతృత్వంలో ఆయనకు యువ న్యాయవాదులు స్వాగతం పలికారు. వేద పండితులు ప్రత్యేక పూజలు చేయించారు.

### మానవత్వం చాటుకున్న బీడీవో



ఆస్పత్రి సిబ్బందితో మాట్లాడుతున్న దృశ్యం

కొరాపుట్: రోడ్డు పక్కన అచేతనంగా పడివున్న వృద్ధురాలిని ఆస్పత్రికి తరలించి బీడీవో కిశోర్ చంద్రసాహు మానవత్వం చాటుకున్నారు. నబరంగ్‌పూర్ జిల్లా నందాహండి సమితి అభివృద్ధి అధికారి (బీడీవో) కిశోర్ చంద్రసాహు తన కార్యాలయానికి గురువారం వెళ్తున్నారు. ఆ సమయంలో అదే మార్గంలో రోడ్డు పక్కన ఒక గుడారంలో వృద్ధురాలు పడి ఉండడం గమనించారు. వెళ్లి చూడగా ఆమె తీవ్రమైన జ్వరంతో బాధపడుతోంది. తనకంటూ ఎవరూ లేరని, ఆమె పేరు తెలియదని స్థానికులు తెలియజేశారు. వెంటనే సిబ్బందితో ఆమెని జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం కొనసాగుతున్న 7 డిగ్రీల చలి వలన ఆమె అనారోగ్యానికి గురయ్యిందని వైద్యులు పేర్కొన్నారు. వెంటనే ఆమెకు నూతన వస్త్రాలు బీడీవో అందజేశారు. వైద్యులు అత్యవసర చికిత్స ప్రారంభించారు.

### బాక్సింగ్‌లో కాంస్య పతకం



ఎచ్చెర్ల క్యాంపస్: పంజాబ్ చండీగఢ్ విశ్వవిద్యాలయంలో సౌత్, వెస్ట్ అంతర వర్సిటీల క్రీడలు జరుగుతున్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం నుంచి పాల్గొన్న బాక్సింగ్ క్రీడాకారుడు పి.అప్పలరాజు గురువారం 54-57 కిలోల బాక్సింగ్ విభాగంలో కాంస్యపతకం సాధించారు. ఎచ్చెర్లలోని శ్రీ వెంకటేశ్వర ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలలో బీపీఈడీ చదువుతున్నాడు. వర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు, రిజిస్ట్రార్ సీహెచ్ఏ రాజేంద్రప్రసాద్ అభినందించారు.

### ఆదిత్యుని సన్నిధిలో నిర్మాత నట్టికుమార్

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని సినీ నిర్మాతల సంఘం ప్రతినిధి, ప్రముఖ నిర్మాత నట్టికుమార్ గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు.

### నైపుణ్య కళాశాలలో శిక్షణలకు దరఖాస్తులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలోని సాంకేతిక శిక్షణ కేంద్రంలో నిర్వహిస్తున్న స్కిల్ కళాశాలలో నైపుణ్య శిక్షణలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి పీబీ సాయిశ్రీనివాస్ తెలిపారు. స్కిల్ కాలేజీలో ఆయన గురువారం వివరాలు వెల్లడించారు. డిగ్రీ, పీజీ పూర్తి చేసిన యువతకు పేషెంట్ రిలేషన్ అసోసియేట్ అంశంలో శిక్షణ ఇచ్చి, ప్లేస్‌మెంట్ కల్పించనున్నట్లు తెలిపారు. 20 నుంచి 28 ఏళ్ల మధ్య వయస్సు, డిగ్రీ ఉత్తీర్ణత అర్హతలని తెలిపారు. శిక్షణ కాలం మూడు నెలలని తెలిపారు. విద్యార్హత ధ్రువీకరణ పత్రాల జిరాక్సులు, రెండు పాస్ పోర్టు సైజ్ ఫొటోలతో దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. పూర్తి వివరాలకు ఫోన్ నంబర్లు 8247656581, 7680945357లను సంప్రదించాలని సూచించారు.

### జనవరిలో హెవీ డ్రైవింగ్ స్కూల్ బ్యాచ్ ప్రారంభం

శ్రీకాకుళం క్రైమ్ : నూతన సంవత్సరం సందర్భంగా ఏపీఎస్‌ఆర్టీసీ హెవీ డ్రైవింగ్ స్కూల్ (15వ బ్యాచ్)ను జనవరి మొదటివారంలో జిల్లాలో ప్రారంభిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయ్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. భారతదేశంలో ఎక్కడా లేని విధంగా డ్రైవింగ్‌లో మెలకువలు నేర్పిస్తూ ఉత్తమ డ్రైవర్లుగా తీర్చిదిద్దడానికి ఏపీఎస్‌ఆర్టీసీ అన్నివిధాలా ప్రయత్నిస్తోందని చెప్పారు. రాబోయే రోజుల్లో డ్రైవర్ల కొరత ఎక్కువగా ఉన్నందున ఆర్టీసీలో శిక్షణ తీసుకుంటున్న డ్రైవర్లకు, ఆర్టీసీతో పాటు ఇతర విభాగాల్లో కూడా అవకాశాలు కలుగుతాయని, ఆసక్తి గల అభ్యర్థులు ఫీజు, ఇతర వివరాల కోసం 9963091999, 7382923293 నంబర్లను సంప్రదించాలన్నారు.



కూచిపూడి నృత్యం ప్రదర్శిస్తున్న యువతులు



మంత్రి సరక, సుధీర్ దాస్, అనసూయ మాఝి తదితరులు

# సందడే.. సందడి

- కొనసాగుతున్న చొయితి ఉత్సవాలు

స్థానిక గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో చొయితి ఉత్సవాలు సందడిగా కొనసాగుతున్నాయి. మూడోరోజు ఉత్సవాలకు మంత్రి జగన్నాథ సరక ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉత్సవాలను తిలకించేందుకు అధిక సంఖ్యలో ప్రజలు వస్తుండడం హర్షణీయమన్నారు. వివిధ రకాల స్టాల్స్ జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు. రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి మాట్లాడుతూ చొయితి ఉత్సవాలు కేవలం ఆనందం కోసమే కాదని, ఎంతోమంది జీవనోపాధికి మార్గాలను సూచిస్తుందన్నారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు బిజయ్ కుమార్ గమాంగో, ఓబీసీ రాష్ట్ర శాఖ ముఖ్య సలహాదారుడు పృథ్వీరాజ్ సాహు, స్పెషల్ డవలప్‌మెంట్ కౌన్సిల్ చైర్మన్ అనసూయ మాఝి, బీజేడీ జిల్లా అధ్యక్షుడు సుధీర్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

- రాయగడ



అగ్ని దివిటీలతో నృత్య ప్రదర్శన



ఉద్యానవన శాఖ ప్రదర్శన



జగన్నాథ దేవతామూర్తులు



ఆదివాసీ నృత్య ప్రదర్శన



స్టాల్స్ వద్ద రద్దీ



ఆదివాసీ కుటీరం



ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్

# గంజాయి స్వాధీనం



గంజాయితో పట్టుబడిన నిందితుడిని చూపిస్తున్న పోలీసులు

పర్లాకిమిడి: గజపతి జిల్లా గుసాని సమితి లింగిపురం జంక్షన్ వద్ద మోహనా సమితి అడవ నుంచి వస్తున్న ఇండికా కార్‌ను ఎక్సైజ్ పోలీసులు తనిఖీలు చేయగా గంజాయి పట్టుబడింది. గంజాయిని అక్రమంగా ఆంధ్రప్రదేశ్‌కు రవాణా చేస్తున్నట్లు సమాచారం మేరకు ఎక్సైజ్, పోలీసు, అటవీ శాఖ సిబ్బంది మూడు టీములుగా ఏర్పడి రామగిరి, గొప్పిలి, లింగిపురం జంక్షన్ల వద్ద కాపుకాశారు. ఈ సందర్భంగా లింగుపురం మీదుగా గొప్పిలి రోడ్డుకు వెళ్తున్న కారును అడ్డగించి అందులో రవాణా అవుతున్న గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

గంజాయి రవాణా చేస్తున్న అడవ గ్రామానికి చెందిన శశికాంత నాయక్‌ను పోలీసులు అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. ఈ గంజాయి బస్తాలు గజపతి జిల్లా బ్రహ్మగిరి నుంచి రవాణా చేస్తున్నట్లు పట్టుబడిన నిందితుడు పోలీసులకు వివరించారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.50 లక్షలు ఉంటుందని ఎక్సైజ్ ఎస్పీ ప్రభాత్ కుమార్ శెఠి తెలియజేశారు.

# రిజర్వాయర్‌లో పడవ బోల్తా

- ఒకరు మృతి
- నలుగురు గల్లంతు



ఒడ్డుకు తీసుకొచ్చిన మృతదేహం



ప్రమాదం జరిగిన ఘాట్ వద్ద ఎమ్మెల్యే పీతం పాడీ

కొరాపుట్: జోలాపుట్ రిజర్వాయర్‌లో పడవ బోల్తా పడడంతో ఒక వ్యక్తి మృతి చెందడంతో పాటు నలుగురు గల్లంతైన ఘటన గురువారం చోటుచేసుకుంది. నందపూర్ ఎస్డీపీవో సంజయ్ మహాపాత్రో తెలిపిన వివరాల మేరకు.. గురువారం వేకువజామున కొరాపుట్ జిల్లా పాడువా పోలీసుస్టేషన్ పరిధి జోలాపుట్ రిజర్వాయర్ కులార్ సింగ్ గ్రామ పంచాయతీ టాంసింగ్ ఘాట్ సమీపంలోని పతాల్ నది వద్ద పడవ బోల్తా పడింది. ఈ ఘటనలో టాంసింగ్ గ్రామానికి చెందిన లాల్‌మణి సిసా (48) మృతి చెందగా, మరో నలుగురు గల్లంతయ్యారు. వీరంతా బుధవారం రాత్రి రిజర్వాయర్‌కు మరో ఒడ్డున ఉన్నటువంటి ఆంధ్రప్రదేశ్‌లోని ఒక గ్రామంలో విందుకు హాజరై నాటు పడవలో తిరిగి వస్తున్నారు. రాత్రివేళ పడవ బోల్తా పడిన విషయం ఉదయం వరకు వెలుగులోకి రాలేదు. అదే మార్గంలో వెళ్లిన ఇతర పడవలు తిరిగి వచ్చాయి. ఉదయం ఈ విషయం గమనించిన స్థానికులు గాలింపు చర్యలు చేపట్టారు. అనంతరం లాల్‌మణి సిసా మృతదేహం బయటపడింది. అదే పడవలో ఉన్నటువంటి శశిరేఖ అర్లాబ్ (35), నబీన అర్లాబ్ (14), పుష్పాంజలి అర్లాబ్ (5), క్రాంతి అర్లాబ్(8)లు గల్లంతైనవారిలో ఉన్నారు. గల్లంతైన వారిలో ముగ్గురు బాలికలు ఉండడం విషాదకరం.

**సంఘటన స్థలానికి ఎమ్మెల్యే**

పడవ బోల్తాపడిన ప్రాంతానికి పొట్టంగి ఎమ్మెల్యే పీతం పాడీ గురువారం రాత్రి వెళ్లారు. అక్కడ గాలింపు చర్యలు చేపడుతున్న అధికారులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. మృతదేహాన్ని బాధిత ఇంటికి చేర్చాలని ఆదేశించారు. మిగతా నలుగురి కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందజేస్తామని తెలియజేశారు.

# అక్రమంగా తరలిస్తున్న ఇసుక సీజ్





సీజ్ చేసిన వాహనాలు

బరంపురం: అక్రమంగా ఇసుక తరలిస్తున్న వాహనాలపై సదర్ ఎస్డీపీవో బిష్ణు ప్రసాద్ పాత్రో ఆధ్వర్యంలో పోలీసులు దాడులు చేపట్టి 4 అక్రమ ఇసుక, గ్రావెల్ రవాణా చేస్తున్న వాహనాలు సీజ్ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. గురువారం ఉదయం సదర్ పోలీసుస్టేషన్ పరిధిలో అక్రమంగా రవాణా అవుతున్న ఇసుకపై పోలీసులు దృష్టి సారించారు. దీనిలో భాగంగా కుకుడాఖండి బ్లాక్ ఉగ్గలపట్టా గ్రామం వద్ద 4 వాహనాలను సీజ్ చేయడంతో పాటు 8 మందిని అరెస్టు చేశారు.

## ఆదుకున్న 108 సిబ్బంది

మందస, కాశీబుగ్గ:

గిరిజనుల పాలిట 108 అంబులెన్స్ వాహనం సంజీవనిగా మారుతోంది. మండలంలోని గిరిజన ప్రాంతమైన గోపాలసాయి అనే గ్రామానికి చెందిన ఓ గిరిజన మహిళను 108 సిబ్బంది గురువారం ఆదుకున్నారు. గ్రామానికి చెందిన సవర పావనికి గురువారం పురిటి నొప్పులు వచ్చాయి. వెంటనే కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందజేశారు. తక్షణం చేరుకున్న సిబ్బంది ఆమెను పలాస ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా గొప్పిలి వద్ద పురిటినొప్పులు అధికమయ్యాయి. దీంతో ఈఆర్సీపీ డాక్టర్ ప్రియ సలహాలతో సిబ్బంది పి.తిరుపతిరావు, కె.కోటేశ్వరరావు ప్రసవం చేశారు. మెడలో బొడ్డుతాడు అడ్డుపడినా జాగ్రత్తగా తల్లీబిడ్డను కాపాడారు. ప్రథమ చికిత్స అందజేసిన అనంతరం పలాస ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీంతో 108 సిబ్బందిని గర్భిణి కుటుంబసభ్యులు, బంధువులు, గిరిజనులు అభినందించారు.



108 వాహనంలో గిరిజన మహిళకు ప్రసవం చేసిన సిబ్బంది

## అంతర్ జిల్లాల టెన్నీ కాయిట్ పోటీలు ప్రారంభం

పాతపట్నం: పాతపట్నం మినీ స్టేడియం క్రీడా మైదానంలో 41వ రాష్ట్ర అంతర జిల్లాల స్త్రీ, పురుషుల టెన్నీకాయిట్ పోటీలను గురువారం ఎమ్మెల్యే రెడ్డి శాంతి ప్రారంభించారు. క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించి ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవాలని ఆమె ఆకాంక్షించారు. 11 జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించి, ఎమ్మెల్యేకు గౌరవ వందనం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం కూడా గ్రామీణ క్రీడాకారుల కోసం ఆడుదాం ఆంధ్రా పోటీలు నిర్వహిస్తోందని గుర్తు చేశారు. జిల్లా టెన్నీ కాయిట్ అసోసియేషన్ అధ్యక్షుడు యెన్ని శేఖరబాబు, కార్యదర్శి వట్ట తవిటయ్య, ఎంపీపీ దోర సావిత్రమ్మ, జిల్లా సాఫ్ట్ టెన్నిస్ అధ్యక్షుడు గురాడి అప్పన్న తదితరులు పాల్గొన్నారు.



41వ రాష్ట్ర అంతర జిల్లాల టెన్నీ కాయిట్ పోటీల క్రీడా జ్యోతిని వెలిగిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

# రైతులను ప్రోత్సహించాలి

- సేంద్రీయ వ్యవసాయంతో మేలు
- రాష్ట్ర వ్యవసాయ విభాగ చీఫ్ సెక్రటరీ డాక్టర్ అరవింద పాడి



సమీక్ష సమావేశంలో పాల్గొన్న అధికారులు

రాయగడ: దేశంలో వ్యవసాయం కొత్త పుంతలు తొక్కుతోందని, దానికి అనుగుణంగా రైతులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని రాష్ట్ర వ్యవసాయ విభాగం చీఫ్ సెక్రటరీ డాక్టర్ అరవింద పాడి అన్నారు. స్థానిక గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న చొయితి వేడుకలకు బుధవారం ఆయన హాజరయ్యారు. అనంతరం డీఆర్‌డీఏ సమావేశం మందిరంలో వ్యవసాయ అధికారులు, సంబంధిత సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతు సంక్షేమంతో పాటు వ్యవసాయాన్ని అధిక లాభాలు చేకూర్చే ఒక పరిశ్రమగా మార్చాలని సూచించారు. అందుకు రైతులకు ఆధునిక వ్యవసాయ విధానంతో పాటు అధిక దిగుబడి, ఆరోగ్యాన్ని అందించే సేంద్రీయ వ్యవసాయంపై అవగాహన కల్పించాలన్నారు. సేంద్రీయ వ్యవసాయంతో భూమికి, ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు. దేశ ప్రజలంతా ఆరోగ్యకరమైన ఆహారం కోసం వేచి చూస్తున్నారని, ఇటువంటి తరుణంలో వరి పంటలపై ఆధారపడకుండా చిరుధాన్యాలు, సేంద్రీయ పంటలు, కూరగాయలు పండించేలా వారిని చైతన్యపరచాలని హితవు పలికారు. అదేవిధంగా వ్యవసాయ రంగంపై ఆసక్తి కనబరుస్తున్న యువతకు సలహాలు, సూచనలు అందజేయాలన్నారు. జిల్లాలో మిల్లెట్ మిషన్ పనితీరు చాలా బాగుండడంతో అభినందనలు తెలియజేశారు. రైతులు కేవలం వ్యవసాయమే కాకుండా నిరంతర లాభాలు వచ్చే పశుపోషణ, గొర్రెలు, కోళ్లు, చేపలు, పందుల పెంపకంపై దృష్టి సారించాలన్నారు. సమావేశంలో వ్యవసాయ శాఖ అధికారి మనోజ్ కుమార్ ప్రధాన్, వాటర్ షెడ్ పీడీ డాక్టర్ దయానిధి బాగ్ తదితరులు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశాన్ని నిర్వహిస్తున్న డాక్టర్ పాడి, పక్కనే దయానిధి బాగ్ తదితరులు

## జాతీయ తైక్వాండో పోటీలకు ఐదుగురు ఎంపిక

శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు జిల్లా నుంచి ఐదుగురు ఎంపికయ్యారు. ఈ పోటీలు డిసెంబర్ 31 నుంచి జనవరి 5వ తేదీ వరకు మధ్యప్రదేశ్‌లోని బీతుల్ వేదికగా జరగనున్నాయి. ఎస్‌జీఎఫ్ జాతీయ పోటీలకు ఎంపికైనవారిలో అండర్-19 విభాగంలో 40 కేజీల బరువు కేటగిరీలో డి.వాణి (ఇంటర్మీడియెట్ సెకండియర్- ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల శ్రీకాకుళం), అండర్-17 విభాగంలో 32 కేజీల బరువు కేటగి రీలో కె.తేజేశ్వని (10వ తరగతి - ఏవీఎస్ఎం హైస్కూల్ గుజరాతీపేట), అండర్-14 విభాగం 38 కేజీల బరువు కేటగిరీలో బెండి వేదశ్రీ (9వ తరగతి - కేంద్రీయ విద్యాలయం శ్రీకాకుళం), అండర్-17 విభాగం 51 కేజీల బరువు కేటగిరీలో ఆర్.వెంకట ప్రీతమ్ (ఇంటర్ ఫస్టియర్ - కేంద్రీయ విద్యాలయం శ్రీకాకుళం), అండర్-14 విభాగం 24 కేజీల కేటగిరీలో ఎల్.తేజేశ్వని (7వ తరగతి- శ్రీచైతన్య స్కూల్ శ్రీకాకుళం) ఎంపికయ్యారు. వీరంతా ఈ పోటీల కోసం గురువారం సాయంత్రం ఇక్కడ నుంచి పయనమై వెళ్తున్నారు. ఎంపికైన క్రీడాకారులను, శాప్ తైక్వాండో కోచ్ డి.లక్ష్మణరావును పలువురు అభినందించారు.

## క్లుప్తంగా

### సర్వేను వినియోగించుకోవాలి

సీతంపేట: పీవీటీజీ సర్వేను వినియోగించుకోవాలని ఐటీడీఏ పీవో కల్పనాకుమారి ఓ ప్రకటనలో ప్రజలను కోరారు. గృహ నిర్మాణ శాఖకు సంబంధించి, సర్వే కూడా చేస్తున్నారన్నారు. ఇప్పటివరకు గృహాలు మంజూరు కాని వారు, పూరిళ్లల్లో నివశిస్తున్న వారి వివరాలు సేకరించడం జరుగుతోందన్నారు. దీనివల్ల పేదలకు లబ్ధి జరుగుతుందన్నారు.

### కొత్త పింఛన్ల దరఖాస్తుల పరిశీలన

బాడంగి: మండల వ్యాప్తంగా కొత్తగా పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి దరఖాస్తులు, అర్హతలను అధికారులు పరిశీలిస్తున్నారు. మొత్తం 113 మంది పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోగా, వారు నిజంగా అర్హులేనన్న విషయాన్ని ఆధారాల ఆధారంగా అధికారులు నిశితంగా గమనిస్తున్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ పరిపాలనాధికారి రామలింగ్వేరరావు తదితరులు పాల్గొన్నారు.

మెంటాడ: మండలంలోని జయితి, కె.ఎల్.వలస, ఇప్పలవలస గ్రామాల్లో కొత్తగా పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి అర్హతలను ఎంపీడీవో త్రివిక్రమ్ గురువారం పరిశీలించారు. అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వం పథకాలు అందజేస్తోందని, కొత్త వారికి జనవరి 1వ తేదీ నుంచి పింఛన్లు అందించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

### హెడ్ కానిస్టేబుల్‌దాతృత్వం

పార్వతీపురం టౌన్: పార్వతీపురం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న కృష్ణమూర్తి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. జగన్నాథపురం కాలనీ ఎంపీపీ పాఠశాలలో చదువుతున్న కొమ్ము సాత్విక్ నవోదయ ప్రవేశ పరీక్షలో 6వ ర్యాంకు సాధించాడు. మరికొద్ది రోజుల్లో తాటిపూడి నవోదయలో చేరాల్సి ఉంది. అయితే సాత్విక్ తండ్రి దివ్యాంగుడు కావడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న హెచ్‌సీ కృష్ణమూర్తి గురువారం స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్ వద్ద విద్యార్థికి రూ.2 వేల రూపాయల ఆర్థిక సాయం చేశారు.

### క్రమశిక్షణతో కూడిన విద్య అవసరం



ఉపాధ్యాయులకు సూచనలు ఇస్తున్న కాంప్లెక్స్ చైర్మన్ వెంకటరమణ

బలిజిపేట: విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యనందించాలని వంతరాం స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ సీహెచ్ వెంకటరమణ తెలిపారు. వంతరాం ఉన్నత పాఠశాలలో వంతరాం, నారన్నాయుడువలస పాఠశాలల కాంప్లెక్స్ పరిధిలో ఉండే సగం మంది ఉపాధ్యాయులకు గురువారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించే సమయంలో పాటించాల్సిన మెలకువలపై అవగాహన కల్పించారు.

### దరఖాస్తుల పరిశీలన వేగవంతం



మాట్లాడుతున్న తహసీల్దార్ ఎన్వీ రమణ

సీతానగరం: మండలంలోని పోలింగ్ కేంద్రాలకు బీఎల్‌ఓల ద్వారా వచ్చిన దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయాలని తహసీల్దార్ ఎన్వీ రమణ ఆదేశించారు. గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సూపర్‌వైజర్లు, సిబ్బందితో ఓటరు నమోదు, సవరణ, తొలగింపు దరఖాస్తుల పరిశీలనపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోలింగ్ బూత్‌ల వారీగా వచ్చిన ఓటర్ల నమోదు దరఖాస్తులతో పాటు చిరునామా మార్పు, డబుల్ ఎంట్రీల దరఖాస్తుల పరిశీలన పూర్తి చేసి, అర్హులందరికీ ఓటుహక్కు కల్పించాలన్నారు. కార్యక్రమంలో రీ సర్వే డీటీ పి. చిట్టెమ్మ, ఆర్ఐ ఎస్. శ్రీనివాసరావు, సీనియర్ సహాయకులు రామారావు, వీఆర్వోలు పాల్గొన్నారు.

### ప్రత్యేక అలంకరణలో లక్ష్మీ నృసింహస్వామి



పూజలందుకుంటున్న లక్ష్మీనృసింహస్వామి

సీతానగరం: మండల కేంద్రంలోని లక్ష్మీనృసింహస్వామి గురువారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకుడు శ్రీనివాసాచార్యులు స్వామివారిని తులసీదళాలు, పూలతో అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

# ‘పది’లో ఉత్తమ ఫలితాలకు కృషి



గుమ్మలక్ష్మీపురం: ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న ఎంఈవో చంద్రశేఖర్

గుమ్మలక్ష్మీపురం: విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన చేయాలని ఎంఈవో బి.చంద్రశేఖర్ సిబ్బందికి సూచించారు. మండలంలోని కొత్తగూడ గిరిజన సంక్షేమ పాఠశాల(బాలురు)లో గురువారం జరిగిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశానికి హాజరైన ఆయన ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యమిస్తోందని, విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు సమకూరుస్తోందన్నారు. ఈ నేపథ్యంలో ప్రతీ విద్యార్థి చదువులో బాగా రాణించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాల్సిన బాధ్యత ఉపాధ్యాయులందరిపై ఉందన్నారు. చదువులో వెనకబడిన విద్యార్థుల విద్యాప్రగతికి ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. పిల్లలకు నాణ్యమైన విద్య, భోజనం అందేలా చూడాలన్నారు. రానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలన్నారు.

జియ్యమ్మవలస: మండలంలోని పెదమేరంగి జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని ఎంఈవో-1 నాగభూషణరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థుల విద్యాసామర్థ్యాలు పెంచేందుకు చేపట్టాల్సిన చర్యలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకుని, పలు సలహాలు, సూచనలు చేశారు. జ్ఞానజ్యోతి, జ్ఞానప్రకాష్‌ల ద్వారా ఎవరికి బోధిస్తారు.. విద్యార్థుల విద్యాసామర్థ్యాలను ఎలా పెంచవచ్చన్న అంశాలను వివరించారు. ప్రతీ విద్యార్థి బాగా చదివి, ఉన్నత స్థాయికి చేరుకునేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని కోరారు.

**ఉత్తమ ఫలితాలు సాధించాలి..**

గరుగుబిల్లి: పదో తరగతి పబ్లిక్ పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలని విద్యార్థులకు ఎంఈవో ఎస్.నాగభూషణరావు సూచించారు. గురువారం మండలంలోని తోటపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించిన ఆయన పదో తరగతి విద్యార్థులతో సమావేశమై, పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధనకు పలు సూచనలు, సలహాలు చేశారు. మార్చి నెలలో పరీక్షలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ప్రతీ పదో తరగతి విద్యార్థి కష్టపడి బాగా చదవాలన్నారు. సంక్లిష్టమైన సబ్జెక్ట్‌లపై తొలుత దృష్టిసారించాలన్నారు. ఏయే అంశాల్లో విద్యార్థులు వెనకబడి ఉన్నారో వారిని గుర్తించి, ఆయా అంశాలపై పట్టుసాధించేందుకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని ఉపాధ్యాయులను కోరారు.

కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జె.ప్రపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

**ప్రయోగ పరీక్షలపై ఆసక్తి..**

వీరఘట్టం: తరగతి గదిలో బోధించే పాఠాలతో పాటు ప్రయోగ పరీక్షలపై కూడా విద్యార్థులకు ఆసక్తి పెంచాలని ఎంఈవో డి.గౌరినాయుడు సూచించారు. గురువారం స్థానిక బాలికోన్నత పాఠశాలలో జరిగిన సైన్స్ స్కూల్ కాంప్లెక్స్ సమావేశానికి హాజరైన ఆయన పలు సూచనలు చేశారు. కృత్యాధార బోధన చేపట్టాలన్నారు. రానున్న పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రత్యేక తరగతులు చేపట్టాలన్నారు. సమావేశంలో స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ కె.పి.నాగమణి, డీఆర్‌పీ ఎ.కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

**ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ..**

పాలకొండ రూరల్: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని ఎంఈవో కె.సోంబాబు, స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ మీసాల సూర్యనారాయణ సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలతో పాటు వీరఘట్టం మండలానికి చెందిన తెలుగు ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ గురువారం ఇచ్చారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులను పబ్లిక్ పరీక్షలకు ఎలా సన్నద్ధం చేయాలని, కెరీర్ గైడెన్స్, ఇన్నోవేటివ్ క్లాస్‌రూమ్ రూపకల్పనపై శిక్షణ ఇచ్చారు.



జియ్యమ్మవలస: పెదమేరంగి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను ఉద్దేశించి, మాట్లాడుతున్న ఎంఈవో నాగభూషణరావు

**సకాలంలో సిలబస్ పూర్తి చేయాలి..**

సీతంపేట: సకాలంలో సిలబస్ పూర్తి చేసి, పదో తరగతి విద్యార్థులను పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధం చేయాలని పీఎంఆర్‌సీ ఏఎంవో పి.కోటిబాబు తెలిపారు. స్థానిక ఏపీ టీడబ్ల్యూఆర్ బాలురు పాఠశాల, గిరిజన బాలురు, బాలికల ఆశ్రమ పాఠశాలల్లో తెలుగు ఉపాధ్యాయులకు ఇస్తున్న ప్రత్యేక శిక్షణను ఆయన గురువారం పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఇక్కడ నేర్చుకునే అంశాలను పక్కాగా పాఠశాలల్లో అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సీఎంవో చిరంజీవులు, జీసీడీవో రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ‘ఆరోగ్యశ్రీ’ పేదలకు గొప్పవరం



తెర్లాంలో ఆరోగ్యశ్రీ కొత్తకార్డులు పంపిణీ చేస్తున్న సచివాలయ ఎంఎల్‌హెచ్‌పీ శ్రీదేవి

తెర్లాం: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీని మరింత వేగవంతం చేయాలని, ఆరోగ్యశ్రీ పథకం పేద ప్రజలకు గొప్పవరమని ఎంపీడీవో శంబంగి రామకృష్ణ, తెర్లాం పీహెచ్‌సీ వైద్యాధికారి రెడ్డి శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రంలో ఆరోగ్యశ్రీ కొత్తకార్డుల పంపిణీ గురువారం చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని పరిశీలించిన ఎంపీడీవో, పీహెచ్‌సీ వైద్యాధికారి మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆరోగ్యశ్రీ కొత్తకార్డులను పంపిణీ చేయాలన్నారు. అలాగే ఆరోగ్యశ్రీ యాప్‌ను వారి స్మార్ట్‌ఫోన్‌లో డౌన్‌లోడ్ చేయించాలని తెలిపారు. గతంలో ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షలు మాత్రమే వర్తించేదని, ప్రభుత్వం ఈ నెల నుంచి ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా రూ.25 లక్షల వరకు వైద్యసదుపాయం అందేలా చర్యలు తీసుకుందన్నారు. నిరుపేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఆరోగ్యశ్రీ కార్డు సీఎం జగన్ అందించిన గొప్ప వరమని, దీనిని లబ్ధిదారులు సక్రమంగా వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో తెర్లాం సచివాలయ ఎంఎల్‌హెచ్‌పీ వై.శ్రీదేవి, ఏఎన్ఎంలు ప్రశాంతి, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

# 31న పశుసంవర్ధక శాఖ సహాయకుల పరీక్ష



మాట్లాడుతున్న డీఆర్వో ఎస్.డి.అనిత

- పకడ్బందీగా ఏర్పాట్లు: డీఆర్వో అనిత

విజయనగరం అర్బన్: జిల్లాలో ఈ నెల 31న నిర్వహించే పశు సంవర్ధకశాఖ సహాయకుల నియామక రాత పరీక్షకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.డి.అనిత అధికారులను ఆదేశించారు. తన కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఏర్పాట్లపై సమీక్షించారు. 31వ తేదీ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆన్‌లైన్ విధానంలో పరీక్ష జరుగుతుందని చెప్పారు. అభ్యర్థులు 8 గంటలకు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. జిల్లాలో 13 ఖాళీలకు గాను సుమారు 1,120 మంది దరఖాస్తు చేసుకున్నారని, ఐదు పరీక్ష కేంద్రాలు ఏర్పాటుచేశామన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు చీఫ్ సూపరింటెండెంట్‌లుగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లను నియమించామన్నారు. పరీక్ష పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో జరుగుతుందని, అభ్యర్థులు తప్పనిసరిగా తమ బయోమెట్రిక్ నమోదు చేయాలని సూచించారు. ప్రతి అభ్యర్థి తప్పనిసరిగా అడ్మిన్ కార్డు, ప్రభుత్వ గుర్తింపు కార్డులు తీసుకురావాలన్నారు. పరీక్ష కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్‌తో సహా ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించబోమని స్పష్టం చేశారు. అభ్యర్థులు పరీక్షానంతరం రఫ్ షీట్లను ఇన్విజిలేటర్లకు అందజేయాలని సూచించారు. అవసరమైన వారికి నిబంధనలకు అనుగుణంగా స్క్రైబ్‌లను అనుమతిస్తామని చెప్పారు. పరీక్ష కేంద్రాలవద్ద తగిన పోలీస్ బందోబస్తు, ప్రథమ చికిత్సా కేంద్రాలను ఏర్పాటుచేయాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ విశ్వేశ్వరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, టీసీఎస్ అధికారులు, ఆయా పరీక్ష కేంద్రాల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# అవగాహనతో వ్యాధులు దూరం



మాట్లాడుతున్న జిల్లా హెల్త్ ప్రోగ్రాం అధికారి జగన్‌మోహనరావు

పార్వతీపురం టౌన్: ఆరోగ్యంపై అవగాహన ద్వారా పలు వ్యాధులకు దూరంగా ఉండవచ్చునని జిల్లా హెల్త్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి. జగన్ మోహనరావు అన్నారు. పట్టణంలోని పలు ప్రైవేట్ కళాశాలల్లో విద్యార్థులకు ఆరోగ్యంపై గురువారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆరోగ్యానికి రోగ నిరోధక శక్తి ప్రామాణికమన్నారు. పౌష్టికాహారం తీసుకుంటూ ప్రతిరోజూ తగినంత శారీరక శ్రమ ఉన్నవారికి రోగ నిరోధక వ్యవస్థ బాగుంటుందన్నారు. శీతాకాలంలో శ్వాస సంబధితమైన వ్యాధులు సోకే అవకాశం ఉన్నందున తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వ్యక్తిగత పరిశుభ్రత చాలా అవసరమని, దీనివల్ల చర్మ వ్యాధులు రావని చెప్పారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ బి.పుష్ప, జయగౌడ్, కళాశాలల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

- ఎంపీడీఓ అకిబ్ జావేద్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ అకిబ్ జావేద్

పార్వతీపురం టౌన్: ప్రభుత్వం అందిస్తున్న శిక్షణను మేట్లు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ అకిబ్ జావేద్ అన్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులో భాగంగా మేట్లకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమాన్ని గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మేట్లు ముందస్తు కొలతలు, మొబైల్ యాప్‌తో హాజరు వేయుట, మస్టర్ల నిర్వహణపై పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలన్నారు. కొలతల ప్రకారం పనులు చేపడితే వేతనం గిట్టుబాటు అవుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఏపీడీ చంద్రరావు, నర్సిపురం, వెంకంపేట, బాలగుడబ, వెంకట్రాయుడుపేట, గోపాలపురం, అడ్డాపుశీల, ఉపాధి హామీ సిబ్బంది జి. నాగలక్ష్మి ఎస్. కూర్మారావు, తదితరులు పాల్గొన్నారు.

**చైతన్యం తీసుకురావాలి..**

మక్కువ: మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం మహిళా మేట్‌లకు ఏపీఓ ఈశ్వరమ్మ ఆధ్వర్యంలో శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జెడ్పీటీసీ సభ్యుడు మావుడి శ్రీనివాసునాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మావుడి రంగునాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ, గ్రామాల్లో ఉపాధి హామీ పనులు ప్రజలు వినియోగించుకునేలా చైతన్యపరచాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ దేవకుమార్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరావు

### 30న పోలిపల్లి పైడితల్లి హుండీ ఆదాయం లెక్కింపు

రాజాం సిటీ: స్థానిక బొబ్బిలి రోడ్డులోని పోలిపల్లి పైడితల్లి అమ్మవారి హుండీ ఆదాయం ఈ నెల 30వ తేదీన లెక్కించనున్నామని ఈవో బి.వి.మాధవరావు ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొనాలని కోరారు.

### క్యాలెండర్ ఆవిష్కరణ

రామభద్రపురం: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు చేతుల మీదుగా ఆంధ్రప్రభ కొత్త క్యాలెండర్ల ఆవిష్కరణ గురువారం జరిగింది. నూతన సంవత్సరంలోకి అడుగిడుతున్న ప్రతిఒక్కరికీ 2024 ఓ మంచి సంవత్సరంగా నిలవాలని ఎంపీపీ ఆకాంక్షించారు. కార్యక్రమంలో మండల జేసీఎస్ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

# మాస్టర్ అథ్లెటిక్స్‌లో రాణించిన పోలీస్ సిబ్బంది



పతకాలు సాధించిన వారిని అభినందిస్తున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లాలోని రామాయపట్నంలో డిసెంబర్ 24, 25 తేదీల్లో నిర్వహించిన 43వ రాష్ట్రస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్-2023లో జిల్లా పోలీసులు ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ ఎం.దీపిక పతకాలు సాధించిన పోలీస్ సిబ్బంది, రిటైర్డ్ పోలీస్ సిబ్బందిని అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడల పట్ల ఆసక్తి కలిగిన వారికి వయసుతో పనిలేదన్నారు. ఆసక్తి, సాధనతో మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో రాణించడం సంతోషకరమైన విషయన్నారు. జిల్లా పోలీస్ శాఖలో ఏఎస్ఐ, కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న త్రినాథరావు, వెంకటేశ్వరరావు, విశ్రాంత హెచ్‌సీలు శంకరరావు, దుర్గారావు ఎంతో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయిలో పతకాలు సాధించడం గొప్ప విషయమని, వారి క్రీడాస్ఫూర్తి యువతకు ఆదర్శనీయమన్నారు. పతకాలు సాధించిన వారిని రూరల్ సీఐ టి.వి.తిరుపతిరావు, ఆర్ఐ టి.శ్రీనివాసరావు, పోలీస్ అధికారులు, సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రక్తమోడిన రోడ్లు

- వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి
- తొమ్మిదిమందికి గాయాలు



అరకు-విశాఖ రోడ్డులో తుమ్మికాపల్లి గేటు సమీపంలో లారీ ఢీకొట్టడంతో మృతి చెందిన పూలవ్యాపారి రామారావు

కొత్తవలస: ఉమ్మడి విజయనగరం జిల్లాలో వేర్వేరు ప్రదేశాల్లో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందగా తొమ్మిదిమంది గాయపడ్డారు. అరకు-విశాఖ రోడ్డులో కొత్తవలస మండలం తుమ్మికాపల్లి గేటు సమీపంలో విశాఖ నుంచి ఫ్లైయాష్ లోడ్‌తో వెళ్తున్నలారీ ఢీకొనడంతో తూర్పు గోదావరి జిల్లా వలమూరు మండలానికి చెందిన రామారావు(58) మృతి చెందాడు. మృతుడు సైకిల్‌పై పూలమొక్కలను తీసుకెళ్లి స్థానికంగా అమ్మకాలు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మొక్కల అమ్మకాలు పూర్తిచేసుకుని సైకిల్‌పై వెళ్తుండగా వెనుక నుంచి లారీ ఢీకొనడంతో దుర్మరణం చెందాడు. లారీ డ్రైవర్ కొత్తవలస పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

**అరకు అందాలు చూసివస్తూ...**





అరకు-విశాఖ రోడ్డులో నిమ్మలపాలెం కూడలి మలుపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువకుడు భాను (ఫైల్) (ఇన్‌సెట్‌లో)భాను(ఫైల్)

ఇద్దరు స్నేహితులు బైక్‌పై అరకువెళ్లి అక్కడి అందాలను తిలకించారు. తిరుగు ప్రయాణంలో రోడ్డు ప్రమాదానికి గురై ఒక యువకుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గాజువాక సమీపంలోని మింది గ్రామానికి చెందిన యువకులు తేజ, భానులు ద్విచక్రవాహనంపై అరకు విహారయాత్రకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో నిమ్మలపాలెం కూడలి మలుపు వద్ద ముందు వెళ్లున్న వాహనాన్ని ఓవర్ ట్రాక్ చేసే క్రమంలో ఎదురుగా వస్తున్న వ్యాన్‌ను ఢీకొట్టారు. దీంతో అక్కడిక్కడే తేజ(23) మృతిచెందగా, భాను గాయపడ్డాడు. క్షతగాత్రుడిని వైద్యంకోసం 108 వాహనంలో విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీస్‌లు తెలిపారు.

**కొత్తవలస-విజయనగరం రోడ్డులో...**

కొత్తవలస-విజయనగరం రోడ్డులో విజయనగరం వైపు నుంచి వచ్చిన లారీ అదే రూట్‌లో వచ్చిన స్కూటీని బలంగా ఢీకొట్టింది. దీంతో స్కూటీపై ప్రయాణిస్తున్న కుమ్మరి బంజిరికి చెందిన యువకులు చాకచక్యంగా తప్పించుకున్నారు. స్కూటీని సుమారు 10 మీటర్ల వరకు లారీ ఈడ్చుకుపోయింది. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు స్వల్పగాయాలతో బయటపడ్డారు.

**బైక్‌ను ఢీకొన్న ఆటో.. ఇద్దరికి గాయాలు**



గాయపడిన వ్యక్తిని 108లో తరలిస్తున్న సిబ్బంది

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో గురువారం ఉదయం బైక్‌ను ఆటో ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. గజపతినగరం నుంచి పెదమానాపురం వస్తున్న ఆటో చినచామాలాపల్లి నుంచి గజపతినగరం వెళ్తున్న బైక్‌ను ఢీకొనడంతో ఆటోలో ఉన్న శివకు, బైక్‌ను డ్రైవింగ్ చేస్తున్న పైడిరాజుకు గాయాలయ్యాయి. ఇద్దరినీ 108లో గజపతినగరం సామాజిక ఆస్పత్రికి తరలించినట్టు పెదమానాపురం ఎస్ఐ శిరీష తెలిపారు.

### కారు-బోలెరా ఢీ..

- నలుగురికి గాయాలు

బొండపల్లి: విజయనగరం జిల్లా బొండపల్లి మండల కేంద్రానికి సమీపంలో గురువారం రాత్రి ఎదురెదురుగా వస్తున్న కారు-బోలెరా వ్యాన్‌లు బలంగా ఢీకొనడంతో నుజ్జునుజ్జయ్యాయి. ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. దత్తిరాజేరు మండలంలోని ఒక ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొని అదే మార్గంలో విజయనగరం వెళ్తున్న గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య వెంటనే కారుదిగి ఘటనా స్థలానికి చేరుకున్నారు. 108కు సమాచారం ఇచ్చి వెంటనే గాయపడిన ఇద్దరిని 108లోను, మరో ఇద్దరిని తన కారులో జిల్లా కేంద్ర సర్వజన ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రి సూపరింటెండ్‌తో మాట్లాడి క్షతగ్రాతులకు మెరుగైన వైద్య సేవలంచాలని సూచించారు. గాయపడిన వారిలో మురసాల బుజ్జి ఒకరుకాగా, మరోముగ్గురి వివరాలు తెలియాల్సి ఉంది. బొండపల్లి ఎస్ఐ రవి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.



కారులో క్షతగాత్రులను ఎక్కించే ఏర్పాట్లు చేస్తున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

# చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



ఆస్పత్రిలో బెల్లాన పైడిరాజు మృతదేహం

రామభద్రపురం: మండలంలోని కొట్టక్కి వద్ద భవనం పైనుంచి జారిపడి తీవ్రగాయాలపాలైన బెల్లాన పైడిరాజు(58) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. విజయనగరం జిల్లా, గాజులరేగ రాళ్ల వీధికి చెందిన పైడిరాజు కొట్టక్కి వద్ద జరుగుతున్న భవన నిర్మాణ పనులకు ఎప్పటిలాగే బుధవారం ఉదయం వెళ్లాడు. భవనం మూడో అంతస్తులో పనిచేస్తుండగా, ప్రమాదవశాత్తు కిందపడి గాయాలపాలయ్యాడు. స్థానికుల సహకారంతో చికిత్స నిమిత్తం విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రికి అతడిని తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ రాత్రి ప్రాణాలు కోల్పోయాడు. మృతుడి భార్య బెల్లాన కుమారి ఫిర్యాదు మేరకు ఎస్ఐ సురేంద్రనాయుడు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. రోజువారీ కూలీగా పనిచేస్తూ కుటుంబ పోషణ చేస్తున్న ఇంటి పెద్దదిక్కును కోల్పోవడంతో కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు.

# వరిచేనుకు నిప్పు



కాలిపోయిన వరిచేనును వేరుచేస్తున్న రైతులు

సంతకవిటి: మండలంలోని శ్రీహరినాయుడుపేటకు చెందిన రైతు గంధ్రేటి రాముకు సంబంధించిన వరిచేను గురువారం కాలిపోయింది. కోసిన పంటను పొలంలోనే కుప్పగా వేయగా, అక్కడి విద్యుత్ స్తంభంపై ఓ పక్షి వాలడంతో, విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ జరిగి, చేనుకు నిప్పంటుకుంది. అప్రమత్తమైన అక్కడి రైతులు మంటలు ఆర్పివేసేందుకు ప్రయత్నించారు. అప్పటికే ఆ వరికుప్ప అంతా కాలి బూడిదైంది.